దంచికొట్టిన వాన


నాగోలు శ్రీనివాస్‌కాలనీలో..

- కాలనీలు, రోడ్లు జలమయం
- రాకపోకలకు వాహనదారుల అవస్థలు

నాగోలు: భారీ వర్షంతో ఎల్‌బీనగర్ నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మంగళవారం సాయంత్రం కురిసిన వర్షంతో నియోజకవర్గంలోని వివిధ డివిజన్లలో రోడ్లపై, కాలనీల్లో పెద్ద ఎత్తున వరద పారింది. దీంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. ఎల్‌బీనగర్ పరిధిలోని మన్సూరాబాద్, నాగోలు, సాగర్ రింగ్‌రోడ్డు, లింగోజిగూడ, చైతన్యపురి పరిధిలోని లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. రోడ్లపైకి భారీగా నీరు చేరడంతో సాగర్‌రింగ్‌రోడ్డు, చింతలకుంట వద్ద, విజయవాడ జాతీయ రహదారిపై వాహన దారులు అవస్థలు పడ్డారు. వెంటనే అప్రమత్తమై జీహెచ్‌ఎంసీ సిబ్బంది రోడ్లపై చేరిన నీటిని తొలగించే పని చేపట్టారు.

మలక్‌పేట జోన్ పరిధిలో...

దిల్‌సుఖ్‌నగర్: భారీగా కురిసిన వర్షానికి మలక్‌పేటజోన్ పరిధిలోని ఓల్డ్‌మలక్‌పేట, తీగలగూడతో పాటు పలు కాలనీలు, బస్తీలు జలమయమయ్యాయి. రోడ్లపై భారీగా నీరు చేరడంతో చాదర్‌ఘాట్, మలక్‌పేట, అల్కాపురి చౌరస్తా, దిల్‌సుఖ్‌నగర్, మూసారాంబాగ్, మలక్‌పేట రైల్వే బ్రిడ్జి తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ స్తంభించింది. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. భారీగా వరద నీరు చేరడంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు ఆందోళనకు గురయ్యారు.


మన్సూరాబాద్ కాలనీలో ...


నాగోలులో..


బండ్లగూడ శ్రావణశ్రీ ఎంక్లేవ్‌లో..


మలక్‌పేటలోని కాలనీ రోడ్డుపై ..


ఓల్డ్‌మలక్‌పేటలో వాహనదారుల ఇక్కట్లు...

సమస్యల స్వాగతం!

- నేటి నుంచి పాఠశాలల పునఃప్రారంభం
- వనస్థలిపురం హైస్కూల్‌లో పూర్తికాని తరగతి గదుల నిర్మాణం
- ఒకవైపు నిర్మాణ పనులు మరోవైపు కొనసాగనున్న విద్యాబోధన
- విద్యార్థులకు తప్పని అవస్థలు


వనస్థలిపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్మిస్తున్న అదనపు తరగతి గదుల భవనం

వనస్థలిపురం: నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభమవుతున్నాయి. వేసవి సెలవుల అనంతరం ఉత్సాహంగా స్కూళ్లకు వస్తున్న విద్యార్థులకు పలు ప్రభుత్వ పాఠశాలల్లో అసంపూర్తిగా ఉన్న తరగతి గదుల నిర్మాణాలు, మూత్రశాలలు వంటి సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. వనస్థలిపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 840 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రస్తుతం ఉన్న తరగతి గదులు సరిపడ లేకపోవడంతో గతేడాది సర్వశిక్షాభియాన్ నిధులు రూ.70 లక్షలతో అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టారు. అయితే పనుల్లో జాప్యం వల్ల పాఠశాల పునః ప్రారంభమయ్యే సమయం వచ్చినా గదుల నిర్మాణం మాత్రం ఇంకా పూర్తికాలేదు. ఒక వైపు తరగతులు ప్రారంభమవుతుండటం, మరోవైపు నిర్మాణం పనులు జరుగుతుండటంతో విద్యార్థుల చదువుకు ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. ఈ విషయమై పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు దుర్గాలతను వివరణ కోరగా ఆగస్టు నాటికి అదనపు తరగతి గదుల నిర్మాణం పూర్తవుతుందని చెప్పారు. అప్పటి వరకు విద్యార్థులకు ఇబ్బందులు తప్పని పరిస్థితులు నెలకొని ఉన్నాయి.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో)... టమాటా 47, వంకాయ 23, బెండ 50, పచ్చిమిర్చి 55, కాకర 45, బీర 55, క్యాబేజీ 21, ఫ్రెంచి బీన్స్ 85, క్యారెట్ 40, దొండ 18–23, చిక్కుడు 55, గోకర 40, బీట్‌రూట్ 23, క్యాప్సికం 63, ఆలు 35, దోస 28, సొర 11, పొట్ల 18, ఉల్లిగడ్డ 39, చామగడ్డ 40. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

ఆరోగ్య పరిరక్షణకు యోగా దోహదం

నాగోలు: ఆరోగ్య పరిరక్షణకు యోగా ఎంతో దోహదం చేస్తుందని టీపీసీ ప్రచార కమిటీ ప్రచార కమిటీ రాష్ట్ర కో -కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. ఈనెల 13వ తేదీ నుంచి కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయం దగ్గర ఉన్న లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్‌లో షిరిడీ సాయి అష్టాంగ యోగ శిక్షణ తరగతుల బ్రోచర్‌ను మంగళవారం నాగోలులోని తన నివాసంలో శ్రీనివాస్‌గుప్తా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా షిరిడీ సాయి అష్టాంగ యోగా గురునిలయం ఫౌండర్ ఇస్మాయిల్ గురూజీ చేపడుతున్న కార్యక్రమాలు ఆదర్శవంతంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో జాగృతి అభ్యుదయ సంఘం చైర్మన్ భావన శ్రీనివాస్, నరేందర్ గురూజీ, శ్రీరాములు గౌడ్, అర్జున్ యోగా ప్రచారక్ ఉపేందర్ గౌడ్, చంద్రశేఖర్, వితలాచారి గురూజీ తదితరులు పాల్గొన్నారు.

చెత్త కుప్పలో ఆడ శిశువు మృతదేహం

నాగోలు: నెలలు నిండని ఆడ శిశువు మృతదేహాన్ని చెత్త కుప్పలో పడేసిన హృదయ విదారక ఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తట్టి అన్నారంలోని ఆదివాసి కాలనీలోని ఒక పాత ఇంటి పక్కన ఉన్న చెత్తలో ఆడ శిశువు మృతదేహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు పడేసిపోయారు. కాలనీ అధ్యక్షుడు రమావత్ మట్టయ్య సమాచారం మేరకు నాగోలు పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు ... శిశువు మృతదేహాన్ని ఎవరు పడేసి ఉంటారనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

ప్రత్యంగిరాదేవికి డైమండ్ ముక్కెర సమర్పణ



దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ కుర్తాళం పీఠంలో కొలువైన ప్రత్యంగిరా పరమేశ్వరిదేవికి మంగళవారం ఉదయలక్ష్మి అనే భక్తురాలు డైమండ్ కూడిన ముక్కెరను సమర్పించారు. ఆలయ సెక్రెటరీ మునిపల్లె శ్రీనివాస్, సువర్ణలత దంపతులు ఉదయలక్ష్మికి అమ్మవారి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో విటల్ శర్మ, సాయి కుమార్ శర్మ, అరుణ, హేమ,రామ శర్మ, శ్రీపతి శర్మ పాల్గొన్నారు.

త్రిపుర గవర్నర్‌ను కలిసిన బీజేపీ నేతలు

మలక్‌పేట: నాగర్‌కర్నూల్ జిల్లా వట్టెం గ్రామంలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం జరిగిన ఓ కార్యక్రమానికి త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి హాజరయ్యారు.ఈ విషయం తెలుసుకున్న భాగ్యనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి సండడి సురేందర్‌రెడ్డి, మూసారంబాగ్ డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి తదితర నాయకులు వట్టెం గ్రామానికి వెళ్లి గవర్నర్ ఇంద్రసేనారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. గవర్నర్‌ను కలిసిన వారిలో బి.నర్సింహ, మడిగల లక్ష్మారెడ్డి, గార్లపాటి జితేంద్రకుమార్, మూసారంబాగ్ అధ్యక్షుడు కొప్పుల దినేష్, జెక్కా మోహన్‌రెడ్డి, ఆవుల ప్రవీణ్‌యాదవ్ తదితరులు ఉన్నారు.


గవర్నర్ ఇంద్రసేనారెడ్డితో సురేందర్‌రెడ్డి దంపతులు

పెండింగ్ పనులపై దృష్టి పెట్టండి

జీహెచ్‌ఎంసీ అధికారులకు మలక్‌పేట ఎమ్మెల్యే బలాల ఆదేశం


అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే బలాల

మలక్‌పేట: నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ అధికారులను మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల ఆదేశించారు. మంగళవారం దారుసలామ్‌లోని కార్యాలయంలో కార్పొరేటర్లు, జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులతో ఎమ్మెల్యే సమావేశమై అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. డివిజన్ల వారీగా రోడ్లు, కమ్యూనిటీహాళ్లు, మ్యాన్‌హోళ్లు, నాలా అభివృద్ధి పనులపై చర్చించారు. పెండింగ్ పనులపై దృష్టి సారించి వాటిని సత్వరం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వరద నీరు నిలిచే ప్రాంతాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా సమస్యలు సత్వర పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు సయ్యద్ మినాజుద్దీన్, సలామ్ షాహిద్, జీహెచ్‌ఎంసీ ఈఈ పీర్‌సింగ్, డీఈఈ బన్సీలాల్, ఏఈ వెంకన్న, ఎంఐఎం నేతలు షఫీయుద్దీన్, అబ్రార్, వర్క్ ఇన్‌స్పెకర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి


క్రిస్టియన్ కాలనీలో అభివృద్ధి పనులపై అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం: అభివృద్ధి పనుల విషయంలో అధికారులు నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం వనస్థలిపురం డివిజన్ పరిధిలోని క్రిస్టియన్ కాలనీలో నిర్మాణం పూర్తి చేసుకున్న రెయిన్ వాటర్ పైప్‌లైన్ పనులు, కొత్తగా నిర్మించబోయే రోడ్డు పనులను అధికారులతో కలిసి ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గతంలో చిన్నపాటి వర్షానికే ఎగువ కాలనీల నుంచి వచ్చే వరద నీటికి క్రిస్టియన్ కాలనీ వరద ముంపుకు గురై కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారని అన్నారు. ఇప్పుడు నూతనంగా వర్షపునీరు పోవడానికి పైప్‌లైన్స్ వేయడం జరిగిందని అన్నారు. అలాగే నూతనంగా రోడ్డు మంజూరు అయిందని అన్నారు. రోడ్డు విషయంలో అధికారులు ఎత్తు పల్లాలు సరిచూసుకుని రోడ్డును వేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ అధికారులు రఫీ, ప్రజ్ఞ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం కబ్జాకు యత్నం..

అడ్డుకున్న కాలనీలవాసులు


ప్రభుత్వ స్థలంలో వేస్తున్న ఫెన్సింగ్ పనులను అడ్డుకుంటున్న సమీప కాలనీల ప్రజలు

మన్సూరాబాద్: ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసేందుకు యత్నించగా సమీప కాలనీలవాసులు అడ్డుకున్నారు. వివరాల్లోకి వెళ్తే... సహారా స్టేట్స్ కాలనీ మొదటి గేటు సమీపంలో ప్రభుత్వ నిబంధనల మేరకు సెట్‌బ్యాక్ వదిలి ఓ అపార్ట్‌మెంట్ నిర్మాణం చేపట్టారు. నిర్మాణం పూర్తయ్యాక సెట్‌బ్యాక్‌గా వదిలిన ఆ స్థలాన్ని సదరు అపార్ట్‌మెంట్ వాసులు చదును చేసి ఫెన్సింగ్ వేసేందుకు యత్నిస్తున్నారు. ఈ విషయాన్ని గమనించిన సహారాస్టేట్స్ కాలనీ, కమలానగర్ కాలనీవాసులు పెద్ద ఎత్తున చేరుకుని ఫెన్సింగ్ పనులను అడ్డుకున్నారు. జీహెచ్‌ఎంసీ స్థలంలో ఫెన్సింగ్ ఎలా వేస్తారని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా సహారాస్టేట్స్ మెయింటెనెన్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు సయ్యద్‌జానీ మాట్లాడుతూ, జీహెచ్‌ఎంసీ స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా ఉపేక్షించేది లేదని, ఈ విషయాన్ని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, జీహెచ్‌ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో కాలనీలవాసులు సుదర్శన్‌రెడ్డి, లక్ష్మయ్య, సత్యనారాయణ, ప్రభాకర్‌రెడ్డి, శేఖరయ్య, భీమానాయక్, నర్సింహగౌడ్, పవన్‌కుమార్, నర్సింహాచారి తదితరులు పాల్గొన్నారు.

సోలార్ ఫెన్సింగ్ తొలగించి... తాళాలు పగులగొట్టి..

ఐదు ఇళ్లలో చోరీకి యత్నం
- ఒక ఇంట్లో నగదు, వెండి అపహరణ

హయత్‌నగర్: ప్రహరీ గోడకు ఉన్న సోలార్ ఫెన్సింగ్‌ను తొలగించి గేటెడ్ కమ్యూనిటీలోకి చొరబడ్డ దొంగలు..ఐదు ఇళ్ల తాళాలు పగులగొట్టి చోరీకి యత్నించారు. అయితే, వారికి ఒక ఇంటిలో మాత్రమే రూ. 5 వేల నగదు, 30 తులాల వెండి లభించడంతో వాటిని అపహరించుకెళ్లారు. హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ పరిధిలోని కుంట్లూర్ ప్రజయ్ గుల్మోర్ గేటెడ్ కమ్యూనిటీ ఇళ్ల సముదాయానికి సంబంధించిన ప్రహరీ వెనుక వైపు ఉన్న సోలార్ ఫెన్సింగ్‌ను దొంగలు తొలగించి కాలనీలోకి చొరబడ్డారు. తాళం వేసి ఉన్న ఐదు ఇళ్లను గుర్తించిన దొంగలు వాటి తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించారు.నాలుగు ఇళ్లలో వారికి ఎలాంటి విలువైన వస్తువులు, నగదు దొరకలేదు. క్షత్రియ గణేష్‌సింగ్ అనే వ్యక్తి ఇంట్లోని బీరువాలో ఉన్న 30 తులాల వెండి, ఐదు వేల నగదు అపహరించుకుపోయారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌ను పిలిపించి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను గుర్తించే పనిలో ఉన్నారు. గతంలో కూడా ఇక్కడ ఇదే తరహాలో చోరీ జరగడంతో వారే మళ్లీ చోరీకి పాల్పడ్డారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.


బీరువాలోని వస్తువులను చిందర వందరగా పడేసిన దొంగలు

‘బీఎన్‌రెడ్డి నగర్’ సమస్యలను పరిష్కరించాలని వినతి


జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి మంగళవారం ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ పంకజకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ, డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు.

‘ధరణి’ అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించండి


మంత్రి పొంగులేటికి వినతి పత్రం అందజేస్తున్న రాజేశ్వర్‌యాదవ్

చంచల్‌గూడ: ఎస్సీ, ఎస్టీ, బడుగు బలహీన వర్గాల భూములు కాజేసి ధరణిలో రికార్డులు మార్చేశారని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, న్యాయవాది ఎ.రాజేశ్వర్‌యాదవ్ ఆరోపించారు. ధరణి అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించి, పేదల భూములు కబ్జా చేసిన అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ఆయన వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నగేష్, జగదీష్, సత్యనారాయణ తదితరులున్నారు.

గోరక్షణ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న బాలకృష్ణ గురుస్వామి

సైదాబాద్: సకల దేవతా స్వరూపమైన గోవులను రక్షించే చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని అఖిల భారత గోసేవా ఫౌండేషన్ అధ్యక్షుడు బాలకృష్ణ గురుస్వామి రాష్ట్ర ప్రభుత్వాన్ని, పోలీసు ఉన్నతాధికారులను కోరారు. మంగళవారం ఐఎస్‌సదన్ డివిజన్ లక్ష్మీనగర్ కాలనీలోని ఫౌండేషన్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, బక్రీద్ సందర్భంగా ప్రతీ సంవత్సరం పాతబస్తీలో పెద్దసంఖ్యలో గోవులను వధించడం ఆందోళన కలిగిస్తోందన్నారు. పలు ప్రాంతాల నుంచి నగరంలోని కబేళాలకు వాహనాల్లో ఆవులను అక్రమంగా తరలిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గోవులను రక్షించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డీజీపీ రవిగుప్తా సహా ఉన్నతాధికారులకు తమ ఫౌండేషన్ తరఫున ఇప్పటికే వినతి పత్రాలు సమర్పించామని తెలిపారు. సమావేశంలో ఫౌండేషన్ ప్రతినిధులు గోవర్ధన్‌రెడ్డి, మాణిక్ యాదవ్, రాఘవేందర్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి


ప్రమాదంలో చనిపోయిన వ్యక్తి మృతదేహం

చాదర్‌ఘాట్: ద్విచక్ర వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సీఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం మధ్యాహ్నం మలక్‌పేట గంజి నుంచి అక్షయ హోటల్ వైపు రోడ్డు దాటుతున్న ఓ వ్యక్తిని ద్విచక్రవాహనం ఢీకొట్టింది. తీవ్రగాయాలు కావడంతో అతను మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీలో భద్రపర్చారు. మృతుడి సంబంధీకులు ఉంటే ఫోన్ నం. 8712660520ను సంప్రదించాలని సీఐ కోరారు.

ద్విచక్ర వాహనదారుడిపై కేసు...

ప్రమాదానికి కారణమైన ద్విచక్ర వాహనదారుడు రాజారామ్(28) పై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. గ్రూప్–1 పరీక్ష రాసి ద్విచక్ర వాహనంపై అశోక్‌నగర్‌కు వెళ్తూ రోడ్డు దాటుతున్న వ్యక్తిని ఢీకొట్టాడని, ప్రమాదంలో ఇతడికి గాయాలు కావడంతో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని చెప్పారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత


బాధితులకు సెల్‌ఫోన్లు అందజేస్తున్న ఏసీపీ కృష్ణయ్య, సీఐ రామాంజనేయులు

నాగోలు: ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో పోగొట్టుకున్న 81 మొబైల్ ఫోన్లను పోలీసులు గుర్తించి బాధితులకు వాటిని తిరిగి అప్పగించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోగొట్టుకున్న ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్(సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిఫికేషన్ రిజిస్టర్) ద్వారా ఎల్‌బీనగర్ క్రైమ్ పోలీసులు గుర్తించారు. వాటిని రికవరీ చేసి మంగళవారం ఎల్‌బీనగర్ ఏసీపీ ఎ.కృష్ణయ్య పర్యవేక్షణలో బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో ఎల్‌బీనగర్ సీఐ ఎల్.రామాంజనేయులు, డీఎస్‌ఐ నరేందర్, క్రైమ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేని పాఠశాలపై డీఈఓకు ఫిర్యాదు


డీఈఓకు ఫిర్యాదు చేస్తున్న బీజేవైఎం నేత జయసాయి తదితరులు

మన్సూరాబాద్: అనుమతులు లేకపోయినా అడ్మిషన్లు తీసుకుంటున్న హయత్‌నగర్ బొమ్మల గుడి సమీపంలోని కాకతీయ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేవైఎం రంగారెడ్డి జిల్లా ఎడ్యుకేషన్ సెల్ కన్వీనర్ జయసాయి రంగారెడ్డి జిల్లా విద్యాధికారికి మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎల్బీనగర్‌లో జయసాయి మాట్లాడుతూ, నకిలీ ధ్రువీకరణ పత్రాలతో హయత్‌నగర్ బొమ్మల గుడి సమీపంలోని కాకతీయ పాఠశాల యాజమాన్యం ప్రాథమిక అనుమతులు పొందిందన్నారు. ఈ విషయంపై బీజేవైఎం నేతలు మండల విద్యాధికారి హిర్యానాయక్‌కు ఫిర్యాదు చేయగా, విచారణ జరిపిన ఆయన పాఠశాల అనుమతులను రద్దు చేయడంతో పాటు అడ్మిషన్లు తీసుకోవద్దని ఆదేశించారని తెలిపారు. అయితే, ఎంఈఓ ఆదేశాలను బేఖాతర్ చేస్తూ కాకతీయ పాఠశాల యాజమాన్యం ప్రస్తుతం విద్యార్థులను చేర్చుకుంటూ తరగతుల నిర్వహణకు యత్నిస్తోందని, సదరు పాఠశాలపై చర్యలు తీసుకోవాలని డీఈఓకు ఫిర్యాదు చేశామన్నారు.

డ్రైనేజీ నీరు రోడ్లపైకి రాకుండా చర్యలు తీసుకోండి


కొత్తపేట పాఠశాల వద్ద డ్రైనేజీ నీటిని శుభ్రం చేయిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

నాగోలు: కొత్తపేట డివిజన్‌లో ఎక్కడా డ్రైనేజీ నీరు రోడ్లపైకి రాయకుండా చర్యలు తీసుకోవాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ జలమండలి అధికారులకు సూచించారు. కొత్తపేట ప్రభుత్వ పాఠశాల వద్ద డ్రైనేజీ నీరు పొంగి రోడ్డుపై వరదలా పారుతోందని కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. బుధవారం నుంచి పాఠశాల పునః ప్రారంభం కానుందని, స్కూల్ లోపల కూడా డ్రైనేజీ నీరు వస్తున్నదని పాఠశాల ఉపాధ్యాయులు కార్పొరేటర్‌కు చెప్పడంతో ఆయన అక్కడికి వెళ్లి పరిశీలించారు. అనంతరం జలమండలి అధికారులతో మాట్లాడి వెంటనే మినీ ఎయిర్‌టెక్ మిషన్‌ను అక్కడికి రప్పించి డ్రైనేజీ లైన్‌ను శుభ్రం చేయించి మురుగు బయటకు రాకుండా చేశారు. మళ్లీ డ్రైనేజీ నీళ్లు పొంగకుండా డ్రైనేజీ మరమ్మతులు చేయాలని అక్కడే ఉన్న జలమండలి ఇన్‌చార్జి ఆరీఫ్‌కు సూచించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయుడు విజేందర్, శ్రీనివాస్, తోట మహేందర్ యాదవ్, నాయకులు అశ్విన్ సింగ్, కొత్త తిరుమల, వెంకట్ రెడ్డి ఉన్నారు.